www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 6 అక్టోబర్ 2025

5

తిరుపతి



దళితులకు ఆలయ ప్రవేశం లేదు..!



ప్రజాశక్తి -దొరవారిసత్రం : దళితలకు ఆలయంలో ప్రవేశంలేదంటూ, దళితలను అడ్డుకొన్న ఘటన వయనం మండల పరిధిలోని పాళ్ళేంపాడులో చోటుచేసుకొంది. వివరాల్లోకి వెళితే దొరవారిసత్రం మండలం, పాల్లెంపాడకు చెందిన, దళితలు గ్రామదేవదేవత కొరిందమ్మకు పొంగళ్ళు పెట్టారు. గర్బ గుడిలో పొంగళ్ళు పెట్టకూడదని, దళితలు గుడి బయట పెట్టాలంటూ, పూజారి గుడికి తాళాలు వేసేశాడు. దీంతో దళితలు స్థానిక ఎస్ఐ అజయ్ కుమార్‌కు పిర్యాదు చేసారు. ఎస్ఐ, తన సిబ్బందితో ఆ గ్రామానికి వెళ్ళి గుడి తలుపులు తెరిపించారు. దళితలు సజావుగా పొంగ్గళ్ళు పెట్టుకొని, పూజలు నిర్వహించూకున్నారు.

పోలీసులు అడ్డుకున్నా.. వర్షం వచ్చినా..

ఉద్రిక్త వాతావరణంలో సిపిఎం 'భూ పోరాటం'

- నిజమైన పట్టాలయితే రాత్రిళ్ళు నిర్మాణం ఏమిటి?
- పేదలకు ఇచ్చిన మాటను ఎమ్మెల్యే నిలబెట్టుకోవాలి: కందారపు మురళి
- పట్టాలపై విచారణ చేయిస్తాం, ఆరు నెలలలోపు అర్హులైన వారికి ఇంటి స్థలాలు : ఆర్డిఓ



ర్యాలీగా వెళుతూ..



రోడ్డుపై బైఠాయించి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): నిరుపేదలైన పేద ప్రజానీకానికి, ఇల్లు లేని వారికి ఇళ్ల స్థలాలను ఇవ్వాలని సిపిఎం పార్టీ చేపట్టిన భూ పోరాటం చంద్రగిరి నియోజకవర్గం మంగళం పరిధిలోని తిరుమల నగర్ గ్రామపంచాయతీలో ఉద్రిక్తతల నడుమ సాగింది. భూ పోరాటాన్ని అడ్డుకోవాలని పెద్ద సంఖ్యలో పోలీసులు అడ్డువచ్చినా, ఒకవైపు వర్షం కురుస్తున్నా జోరు వానలోనూ మొక్కవోని దీక్షతో భూ పోరాట కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గ ఎమ్మెల్యే పేదలందరికీ త్వరలోనే సర్వే ట్రైనింగ్ అకాడమీ స్థలంలో ఎన్టీఆర్ గృహ కల్పన ద్వారా ఇల్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని, ఆలోపే కొందరు అకాడమీకి సంబంధించిన స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేస్తుంటే అధికార యంత్రాంగం అడ్డుకోకపోగా న్యాయంగా పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ పోరాటం చేస్తుంటే అడ్డుకోవడం విడ్డూరంగా ఉందని సిపిఎం నేత కందారపు మురళి పోలీసులను ప్రశ్నించారు. మూడు రోజుల క్రితం, తిరుమల నగర్ గ్రామపంచాయతీ, చెన్నాయిగుంట గ్రామ లెక్క దాఖలా సర్వేనెంబర్ 195/2/4 లోని 41 ఎకరాల 25 సెంట్లు సర్వే ట్రైనింగ్ అకాడమీ స్థలంలో ఇల్లు లేని అర్హులైన పేదలందరూ ఇళ్ల నిర్మాణం చేసుకోవాలని సిపిఎం పార్టీ బహిరంగ ప్రకటన ద్వారా పిలుపు ఇచ్చిన నేపథ్యంలో అర్హులైన పేదలందరూ సిపిఎం భూ పోరాటానికి మద్దతు ఇస్తూ ఆదివారం తిరుపతి-కరకంబాడి మార్గంలోని బొమ్మల క్వార్టర్స్ వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. సిపిఎం పార్టీ నేత కందారపు మురళి ఆధ్వర్యంలో ఎర్రజెండాలు చేతపట్టుకొని, భూ పోరాటంలో భాగంగా ర్యాలీగా సర్వే ట్రైనింగ్ అకాడమీ స్థలం వద్దకు వెళుతుండగా మార్గమధ్యలో పెద్ద సంఖ్యలో పోలీసులు అడ్డుకున్నారు. తమ న్యాయమైన కోరిక, చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే ఇచ్చిన హామీ మేరకే ఇంటి స్థలాల కోసం వెళుతున్నామని, తమ పోరాటానికి అడ్డు చెప్పవద్దని పోలీసులను కోరారు. పోలీసులు వినకపోవడంతో అక్కడే రోడ్డుపై బైఠాయించి, జోరున వర్షం కురుస్తున్నా పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ నినాదాలు చేశారు. పోలీసులకు, సిపిఎం నేతల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా సిపిఎం నేత కందారపు మురళి మాట్లాడుతూ సర్వే ట్రైనింగ్ అకాడమీ భూములు ఆక్రమణకు గురవుతున్నా యని తాము ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని, ఆక్రమణలను అడ్డుకొని నిలువరించడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. న్యాయమైన కోరిక నెరవేర్చుకోవడా నికి పేదలు వెళుతుంటే పోలీసులు డ్రోన్, బాడి కెమెరాలు ఏర్పాటు చేసి చిత్రీకరించడం విడ్డూరం గా ఉందన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో 2700 పట్టాలు పేదలకు ఇచ్చారని, స్థలం నేటికీ చూపలేదన్నారు. అనాడు పేదలను అడ్డం పెట్టు కొని అనేకమంది కోటానుకోట్ల రూపాయలు అక్రమంగా వసూలు చేశారని, ఆనాటికి ఈనాటికి తేడా ఏమీ కనబడడం లేదని, పేదలు మాత్రం అవస్థలు పడుతూనే ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు కావస్తున్నా... ఇచ్చిన హామీని అమలు చేయడంలో జాప్యం చేస్తుండటం సమర్థనీ యం కాదన్నారు. ఒకవైపు పేదలకు ఇళ్ల స్థలాలు కావాలని పోరాటం చే స్తుం టే మరోవైపున ప్రభుత్వ భూములను ఆక్రమణ చేయటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురి అవుతున్నాయని అధికారుల దృష్టికి తీసుకువెళ్ళినా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఆక్రమణలు చేసేవారు వారు పొందినవి నిజమైన పట్టాలు అయితే రాత్రిళ్ళు ఇళ్ల నిర్మాణం చేపట్టడం ఏమిటని ప్రశ్నించారు. వాటి పైన పూర్తిస్థాయి విచారణ జరిగి, నకిలీ పట్టాలు అని తేలితే చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. న్యాయం జరిగేంత వరకు కదిలేది లేదని జోరు వర్షంలో పోరాటాన్ని కొనసాగించారు. సిపిఎం భూ పోరాట విషయాన్ని తెలుసుకున్న తిరుపతి రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ రామ్మోహన్ భూ పోరాట కేంద్రానికి చేరుకొని సిపిఎం నేతలతో పాటు ఉన్న పేదలతో మాట్లాడారు. పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని, ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించ బోమని ఆర్డివో స్పష్టం చేశారు. బిటిఆర్ కాలనీ, మంగళం ప్రాంతంలో అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. అర్హులైన వారందరికీ స్థలాలు ఇవ్వడానికి ప్రభుత్వం సన్నద్ధంగా ఉందని, సర్వే ట్రైనింగ్ అకాడమీ ఏర్పాటుకు మరొక చోట స్థల పరిశీలన చేయడానికి ప్రభుత్వానికి త్వరలోనే లేఖ రాస్తున్నామని, మంగళం ప్రాంతంలో ఉన్న పేదలందరికీ తిరుమల నగర్ ప్రాంతంలోనే ఇళ్ల స్థలాలు ఇస్తామన్నారు. అర్హులైన ప్రజలందరూ ఇళ్లస్థలాల కోసం 10వ తేదీన తమ కార్యాలయానికి వచ్చి అర్జీలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమణలు చేయాలని పూనుకుంటే ఎంతటి వారినైనా విడిచి పెట్టమని, చట్ట ప్రకారం తగిన శిక్షలు అమలు చేస్తామన్నారు. సిపిఎం నేతలు ఏదైతే భూ ఆక్రమణ జరుగుతోందని ఫిర్యాదు చేశారో, వాటి నిర్మాణాలను ఆపివేశామని, దీనిపై సమగ్ర విచారణ జరిపిస్తామని ఆర్డిఓ స్పష్టం చేశారు. బిటిఆర్ కాలనీ, మంగళం ప్రాంతంలో అర్హులైన పేదలందరినీ సర్వే ద్వారా గుర్తించి ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని, అత్యవసరమైన పేదలు ఇబ్బందులు పడుతూ ఉంటే అటువంటి వారికి తక్షణంగా కొందరికి ఇళ్లను కేటాయింపు చేస్తామని ఆర్డిఓ హామీ ఇచ్చారు. ఆర్డిఓ రామ్మోహన్ ఇచ్చిన స్పష్టమైన హామీతో సిపిఎం నేతలు చేపట్టిన భూ పోరాటాన్ని విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి.సుబ్రమణ్యం నగర కార్యదర్శి కె. వేణుగోపాల్ సిపిఎం జిల్లా నేతలు ఎస్. జయచంద్ర, మాధవ్, సాయిలక్ష్మీ, రవి, బుజ్జిలతోపాటు బిటిఆర్ కాలనీ సిపిఎం నేతలు మునిరత్నం, మోదీన్, చల్లా చినవెంకటయ్య, శ్రీనివాసులు, బాదుల్లా తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో పేదప్రజలు పాల్గొన్నారు.



ఆర్డీఓకు వినతి

మున్సిపాల్టీల అభివృద్ధే ధ్యేయం

- మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ



సమావేశంలో ఎమ్మెల్యేలు నెలవల విజయశ్రీ, పాశిం సునీల్ కుమార్, మంత్రి నారాయణ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రాష్ట్రంలో ప్రతి ఇంటికి కొళాయి ద్వారా మంచినీరు సరఫరా చేయాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని, ఇందు నిమిత్తం గూడూరు మున్సిపాలిటీకి 73 కోట్ల రూపాయలు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అమృత్ స్కీం ద్వారా రాష్ట్రంలో పదివేల కోట్ల రూపాయలతో పలు మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట మున్సిపాలిటీలపై ఆదివారం నిర్వహించిన సమీక్ష సమావేశానికి మంత్రి నారాయణ విచ్చేశారు. ఎమ్మెల్యేలు సునీల్ కుమార్, విజయశ్రీ, కురుగోండ్ల రామకృష్ణలతో మంత్రి మున్సిపాలిటీల అభివృద్ధి, పెండింగులో ఉన్న పనులపై అధికారులతో చర్చించారు. ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ గూడూరు అభివృద్ధికి గతంలో మంత్రిగా ఉన్నప్పుడు నారాయణ ఎంతో సహకారం అందించారన్నారు. గూడూరు మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాలను తొలగించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. త్వరలోనే చెరువు కట్ట అభివృద్ధి పనులు ప్రారంభించడం జరుగుతుందని అభివృద్ధికి సహకారం అందిస్తున్న మంత్రి నారాయణ కు నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయ శ్రీ మాట్లాడుతూ సూళ్లూరుపేట అభివృద్ధికి అనేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. మంత్రి సహకారంతో మరింత అభివృద్ధి చేస్తమని తెలిపారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, మున్సిపల్ కమిషనర్లు వెంకటేశ్వర్లు , ఫజులుల్లా, చిన్నయ్య, వెంకట్రామిరెడ్డి, నాయకులు శీలం కిరణ్ కుమార్, పులిమి శ్రీనివాసులు మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి : సిఐటియు



మంత్రి నారాయణకు వినతి పత్రం ఇస్తున్న సిఐటియు నేతలు

గూడూరు మున్సిపల్ కార్యాలయానికి ఆంధ్ర ప్రదేశ్ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆదివారం విచ్చేశారు. అమృత్ పథకం క్రింద అభివృద్ధి పనులక, ఆయా నియోజకవర్గ శాసనసభ్యులతో, మున్సిపల్ కమిషనర్లు చర్చలు అనంతరం ఏ.పీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సి.ఐ.టి.యు) అనుబంధం గూడూరు పట్టణ మున్సిపల్ కార్మికుల కమిటీ నాయకుల ఆధ్వర్యంలో గౌరవ ఆంధ్రప్రదేశ్ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, గూడూరు నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్. సునీల్ కుమార్ సమక్షంలో మున్సిపల్ కార్మికులు తమ సమస్యలపై కలవడం జరిగింది. 12వ పి. ఆర్.సి కమిటీ నియామకం మున్సిపల్ కార్మికులందరికీ జీతాలు పెంచాలి, మున్సిపల్ పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ కార్మికులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయాలని, చనిపోయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబంలో ఒకరికి పని కల్పించాలని, వయోపరిమితి 62 ఏళ్లకు పెంచాలని, సమ్మె కాలపు జీతం చెల్లించాలని, గత ప్రభుత్వంలో జరిగిన సమ్మెలో భాగంగా ఒప్పందాల జీవోను ఇవ్వాలని, తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పై వినతి పత్రం మంత్రికి అందించారు. మంత్రి నారాయణ స్పందిస్తూ సీ.ఎం.దృష్టికి సమస్యలు తీసుకెళ్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ధారా కోటేశ్వరరావు, గూడూరు పట్టణ కార్యదర్శి భూలోక మురళి, గూడూరు ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్, సి.ఐ.టి.యు గూడూరు పట్టణ ప్రధాన కార్యదర్శి బి.వి. రమణయ్య, అడపాల ప్రసాద్ ఏంబేటి చంద్రయ్య, ఎన్. వెంకటరమణ, బాలాజి, గిరి, వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన.. భద్రతా ఏర్పాట్లపై సమావేశం



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతిలో ముఖ్యమంత్రి త్వరలో పర్యటించనున్న నేపథ్యంలో, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ అధ్యక్షతన తిరుపతి పోలీస్ అతిథి గృహం సమావేశ హాల్‌లో అడ్వాన్స్ సెక్యూరిటీ లైయసన్ (ఏఎస్ఎల్) సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి సీఎం సెక్యూరిటీ అధికారులు, ఇంటెలిజెన్స్, ఆర్అండ్‌బీ, మున్సిపల్, ఫైర్, హెల్త్, ఎలక్ట్రిసిటీ, రవాణా శాఖల అధికారులు, సీనియర్ పోలీస్ అధికారులు హాజరయ్యారు. సమావేశంలో ముఖ్యంగా భద్రతాపరమైన అంశాలపై చర్చ జరిగింది. అనంతరం హెలిప్యాడ్, నారావారిపల్లి తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి భద్రతా ఏర్పాట్లలో ఎటువంటి లోపం ఉండకూడదని, ప్రతి శాఖ వారు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు రవిమనోహర్ ఆచారి, నాగభూషణరావ్, వెంకటరాముడు, శ్రీనివాస రావ్, డిస్పిలు వెంకట నారాయణ, ప్రసాదరావ్, సిటీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఇంటెలిజెన్స్ అధికారులతో పాటు అన్ని సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నారా నామ్మూర్తి నాయుడి విస్తరి కార్యక్రమానికి విచ్చేస్తున్న సీఎం.. హెలీ ప్యాడ్ పర్యవేక్షణ



ప్రజాశక్తి - చంద్రగిరి : సీఎం చంద్రబాబు నాయుడు గారు రేపు తన తమ్ముడు నారా రామ్మూర్తి నాయుడు విస్తరి కార్యక్రమానికి నారావారిపల్లెకు రానున్నారు. ఈ సందర్భంగా అన్ని ఏర్పాట్లను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, నారా ఇందిర, నారా గిరీష్‌లు పర్యవేక్షించారు. సీఎం కుటుంబ సమేతంగా రానుండటంతో ఈ పర్యటన అధికారులు, నాయకులు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఎ.రంగంపేట హై స్కూల్ వెనుక భాగంలో హెలిపాడ్‌ను ఎమ్మెల్యే పులివర్తి నాని, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడులు పరిశీలించారు. కార్యక్రమానికి వచ్చే కార్యకర్తలకు, అభిమానులకు సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే నాని సూచించారు.

అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

- దళిత ఎంపీటీసీ నెలటూరు రవి



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతి జిల్లా, బుచ్చినాయుడు కండ్రిగ మండలం, కాటూరు దళిత ఎంపీటీసీ నెలటూరు రవి అంబేద్కర్ విగ్రహం దహనం ఘటనను ఖండించారు. చిత్తూరు జిల్లా, వెదురుకుప్పం మండలం, దేవళంపేటలో డా అంబేద్కర్ విగ్రహం దహనం ఘటన అమానుషమన్నారు. నిందితులను అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఇంటర్నేషనల్ దళిత జర్నలిస్టుల నెట్వర్క్ ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



తప్పు ఎవ్వరు చేసిన కఠినంగా శిక్ష పడాలి

: వైస్సార్సీపీ నాయకులు రాకేష్ కిరణ్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడాన్ని ఖండిస్తూ ఖండిస్తూ ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్ఆర్సిపి క్రియాశీలక నాయకులు రాకేష్ కిరణ్ మాట్లాడుతూ తప్పు ఎవరు చేసిన కఠినంగా శిక్షించాలని కోరారు. సర్పంచ్ హోదాలో ఉన్న గోవిందయ్య రోడ్డుపై బైఠాయించి పోలీసుల కాళ్లు పట్టుకుని బ్రతిమాలాడడం బాధను కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు.

భక్త కనకదాసు విగ్రహావిష్కరణ



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి, ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో శ్రీ భక్తకనకదాసు విగ్రహ ఆవిష్కరణ ఆదివారం ఘనంగా నిర్వహించారు. విగ్రహ స్థాపన కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. విగ్రహ ఆవిష్కరణకు ముఖ్య అతిథులుగా కర్నూలు రాజ్యసభ సభ్యులు నాగరాజు, రాష్ట్ర బీసీ వెల్ఫేర్, జౌళిశాఖ మంత్రి సవిత, కర్ణాటక మాజీ మంత్రివర్యులు రేవన్న, ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు, ఏపీ యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, బెంగుళూరు కనకదాస మఠం శ్రీ సిద్ధ రామానంద స్వామి, కురబ కుల పెద్దలు హాజరయ్యారు. మంత్రి సవిత ర్యాలీగా బయలుదేరి బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన శ్రీభక్తకనకదాసు విగ్రహాన్ని ఆవిష్కరించి, పూలమాలలు వేశారు. ఆతర్వాత రామతులసి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథులు రాష్ట్ర బీసీ వెల్ఫేర్, జౌళిశాఖ మంత్రి సవిత మాట్లాడుతూ నాన్నగారి పేరు మీద విగ్రహం వితరణ ఇవ్వడం ఆనందంగా ఉందని తెలిపారు. రేవన్న మాట్లాడుతూ కురుబ భవన్ మంజూరు చేసుకుంటే భవన ఏర్పాటుకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. సిద్ధ రామానంద స్వామి మాట్లాడుతూ భక్త కనకదాసు విగ్రహ ఏర్పాటు మహత్కార్యమన్నారు. ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు, ఏపీ యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్‌లు సంఘానికి తమ సహకారం ఉంటుందని తెలిపారు.

ముక్కంటి సేవలో సినీ నటుడు సుమన్



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఆదివారం సినీ నటుడు సుమన్ కుటుంబ సమేతంగా విచ్చేశారు. వీరికి ఆలయాధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. రాహు-కేతు సర్ప దోష నివారణ పూజలు చేసుకున్నారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. తదనంతరం దక్షిణామూర్తి ఆలయం వద్ద వేద పండితులు ఆశీర్వచనాలు పలకగా, ఏఈవో మోహన్ ఒక్కటి తీర్థప్రసాదాలు, జ్ఞాపికాలు అందజేశారు. అదేవిధంగా స్థానిక జుమ్ లేషా పీర్ దర్గాను కూడా సుమన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దర్గా పితాధిపతి సాదర స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గిరిజనులు ఓట్లకే పరిమితమా..!

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తర తరాలుగా గిరిజనులను ఓటు బ్యాంకు రాజకీయాలకు మాత్రమే వినియోగించుకుంటున్నారని, నామినేటెడ్, రాజ్యాంగ పదవుల్లో తీరని అన్యాయం చేస్తున్నారని టీడీపీ ఎస్టీ విభాగం నాయకులు ఎం.సుబ్బయ్య ఆదివారం ఒక ప్రకటనలో కూటమి ప్రభుత్వాన్ని విమర్శించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో నామినేటెడ్ పదవుల పంపకాల్లో గిరిజనులకు జరిగిన అన్యాయమే ఇందుకు నిదర్శనమన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ, ట్రస్టు బోర్డు నియామకాల్లో కూటమి గెలుపుకు కష్టపడ్డ గిజరిన నేతలందరికీ మొండి చేయి చూపడం బాధాకరమన్నారు. ఇలా అయితే గిరిజనులు కూటమికి దూరమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

అసత్య ప్రచారాలను కాదు ..

టిటిడి వెబ్ సైట్‌ను నమ్మండి



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: తిరుమల తిరుపతి దేవస్థానంపై సోషల్ మీడియాలో వస్తున్న వదంతులు నమ్మొద్దని, టిటిడి వెబ్సైట్ ను ఫాలో కావాలని దేవస్థానం వివరించింది. ముఖ్యంగా వృద్దుల దర్శన సమయం, అలిపిరిలో మందు బాటిళ్ల విషయమై టీడీపీ క్లారిటీ ఇచ్చింది. తిరుమల విశిష్టతను, తిరుమల వైభవాన్ని చాటిచెప్పే వెబ్‌సైట్‌లు కొన్ని ఉండగా, తిరుమల పవిత్రతను దెబ్బతీసేలా మరికొన్ని సైట్లు అసత్య ప్రచారాలు చేస్తున్నట్లు తెలిపింది. సోషల్ మీడియా వేదికగా జరిగే దుష్ప్రచారాలను టీటీడీ ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ శ్రీవారి భక్తుల మనోభావాలను, తిరుమల పవిత్రతను టీటీడీ కాపాడుతోందని తెలిపింది.

తిరుమలలో ఇక ఆ ఇబ్బంది ఉండదు..

టీటీడీ కొత్త టెక్నాలజీతో భక్తులకు మోసాల బారినుండి విముక్తి లభించనుంది. తిరుమలలో వయో వృద్ధుల దర్శనం గురించి తప్పుదోవ పట్టించేలా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని టీటీడీ స్పష్టం చేసింది. రోజూ వేయి మంది వయోవృద్ధులు, దివ్యాంగులకు దర్శనం కల్పిస్తున్నట్లు తెలిపింది. ఈ దర్శనాలకు సంబంధించిన ఆన్ లైన్ కోటాను మూడు నెలల ముందుగానే ఆన్‌లైన్ కోటాను విడుదల చేస్తామని తెలిపింది. ఈ టికెట్ పొందిన భక్తులకు రూ.50 లడ్డూ ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపింది. అలాగే తిరుమల నంబి ఆలయం వద్దనున్న సీనియర్ సిటిజన్/పీహెచ్‌సీ లైన్ ద్వారా ప్రతిరోజూ మధ్యాహ్నం మూడు గంటలకు వారిని శ్రీవారి దర్శనానికి అనుమతిస్తారని తెలిపింది. సోషల్ మీడియాలో ప్రసారమయ్యే తప్పుడు వార్తలను నమ్మవద్దన్న టీటీడీ.. సరైన సమాచారం కావాలంటే టిటిడి వెబ్సైట్ ను సంప్రదించాలని వివరించింది. మరోవైపు తిరుమలకు వెళ్తున్న శ్రీవారి భక్తులను మందుబాబులు ఇబ్బందులు పెడుతున్నారంటూ జరుగుతున్న ప్రచారాన్ని టీటీడీ ఖండించింది. అలిపిరి మెట్ల మార్గం వద్ద కొంతమంది మందుబాబులు.. మద్యం సీసాలను పగులగొట్టి రోడ్డు మీద వేశారంటూ సోషల్ మీడియాలో వార్తలు వచ్చాయి. దీనిపై టీటీడీ క్లారిటీ ఇచ్చింది.

పిజిఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఐఏఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఫోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 0877-2227208 కి కాల్ చేసి మాట్లాడవచ్చని తెలియజేశారు.

నేటి నుంచి తపాలా వారోత్సవాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: జాతీయ తపాలా వారోత్సవాలు సోమవారం నుంచి అక్టోబర్ 11 వరకు నిర్వహించనున్నట్లు శ్రీకాళహస్తి సబ్ డివిజన్ తపాలా శాఖ ఐపీఓ బాలాజీ ఆదివారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి సబ్ డివిజన్ పరిధిలోని అన్ని తపాలా శాఖా కార్యాలయాల్లో ప్రత్యేక క్యాంపుల ద్వారా వివిధ సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. పొదుపు పథకాలు ఓపెనింగ్, ఇన్సూరెన్స్ పాలసీలు, ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ఖాతా సేవలతో పాటు కేంద్ర ప్రభుత్వ పథకాలను కూడా ప్రజలకు అందుబాటులో ఉంచుతామని చెప్పారు. తపాలా వారోత్సవాలు భాగంగా తపాలా శాఖ అందిస్తున్న ప్రత్యేక సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఐపిఓ బాలాజీ విజ్ఞప్తి చేశారు.

శాఖాహార ర్యాలీ



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా పరిషత్ బాలుర పాఠశాల నుండి శాకాహార ర్యాలీని ప్రారంభించారు. తిరుపతి స్పిరిచువల్ సొసైటీ అధ్యక్షుడు, పీఎంసీ డైరెక్టర్ సంగీత బాబు జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల నుంచి భారీసంఖ్యలో ధ్యానులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. రామసేతు వంతెన పెండ్లిమండపం, ముత్యాలమ్మ గుడి, బహదూర్ పేట తెట్టు, జయరాం రావు వీధి మార్గం గుండా ర్యాలీ సాగింది. కరపత్రాలు పంచుతూ శాకాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి పిరమిడ్ సొసైటీ అధ్యక్షుడు నందకుమార్, శ్రీజ్ఞాన ప్రసూనాంబ పిరమిడ్ ధ్యానసేవ ట్రస్ట్ చైర్మన్ సుబ్బారావు, వైస్ చైర్మన్ రంగయ్య, కోటల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కుంభాభిషేకంలో ఎమ్మెల్యే




ప్రజాశక్తి - యర్రావారిపాలెం: మండల పరిధిలోని చెరుకువారిపల్లి పంచాయతీ, వంకమద్దివారిపల్లిలో నూతనంగా నిర్మించిన చౌడేశ్వరి దేవి ఆలయ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పులివర్తి నాని పాల్గొన్నారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి, తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.

కల్యాణ మండపం ప్రారంభం



ప్రజాశక్తి - గూడూరు టౌన్ :గూడూరు, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్మించిన కల్యాణమండపాన్ని ఆదివారం ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ప్రారంభించారు. కల్యాణ మండప అభివృద్ధి పనులకు సహాయం అందించిన దాతలను ఎమ్మెల్యే సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ కార్యక్రమమైనా పూర్తి అవ్వాలంటే సమర్థుడైన వ్యక్తి ఉండాలని, బ్రాహ్మణ సంఘ అధ్యక్షులు శివకుమార్ ఎంతో ఉత్సాహంగా దాతల నుండి సహాయం పొంది కళ్యాణ మండపం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో బ్రాహ్మణ సంఘానికి ఎప్పుడు అవసరమైనా మా వంతు సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం సంఘ అధ్యక్షులు శివకుమార్ మాట్లాడుతూ డాక్టర్ జనార్దన్ రెడ్డి రోహిణి దంపతులు ఎనిమిది లక్షల రూపాయలు మొదటి సహాయం అందించారన్నారు. ఈ కార్యక్రమంలో శిరోమణి శర్మ, డాక్టర్ జనార్దన్ రెడ్డి, ఉపాధ్యక్షులు రామ్ మూర్తి, జనరల్ సెక్రటరీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ట్రస్ట్ బోర్డు సభ్యులకు సన్మానం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయం పాలక మండలిలో సభ్యులుగా ఎంపికైన కాపు నేతలను రాధారంగ మిత్ర మండలి నియోజకవర్గ అధ్యక్షులు సిద్దులుగారి ప్రసాద్ ఆదివారం ఘనంగా సత్కరించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ సతీమణి కోలా విశాలాక్షి, జనసేన నేత దండి రాఘవయ్యలను ఈ సందర్భంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అతి చిన్న వయసులో విశాలాక్షి ముక్కంటి సేవ చేసుకునే భాగ్యం కలిగిందంటూ ప్రసాద్ అభినందించారు.

బకాయిలు చెల్లించండి



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఆర్టీసీ ఉద్యోగుల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రావు కోరారు. ఆదివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. 11వ పీఆర్సీ, - 24నెలల బకాయిలు, పెండింగ్ డీఏలు తదితర బకాయిలను చెల్లించాలన్నారు. లేని పక్షంలో పోరాటాలు సాగించాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసయ్య, వైవీ నారాయణ, సుబ్రమణ్యంరాజు, మురగమ్మ, విజయ్ కుమార్, చంద్ర, మస్తాన్, సుబ్బారావు, వెంకటేశులు, జిలానీ, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిబిరం

ప్రజాశక్తి - బాలాయపల్లి: నారాయణ ఆరోగ్యమస్తు పథకం ద్వారా ఉచిత వైద్య శిబిరాన్ని మన్నూరు గ్రామ పరిసర ప్రాంతాల ప్రజలకు అందించే లక్ష్యంతో మండల వైసీపీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కాటూరు ప్రసాద్ రెడ్డి, గ్రామ ప్రజల సహకారంతో ఉచిత వైద్య సలహా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని క్యాంపు నిర్వాహకులు కోరారు. సోమవారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు బాలాయపల్లి మండలం, మన్నూరు శివాలయంవీధి, పాత ఊరు వద్ద ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అల్లుడిపై కన్నేసి.. కూతుర్ని కాటేసి..



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: అల్లుడితో కామవాంఛ తీర్చుకునేందుకు కన్నపేగునే కాటేయాలని చూసిందో తల్లి. ఆ వాంఛ శాశ్వతంగా ఉండాలనే దురుద్దేశంతో కూతురు ఎదుటే అల్లుడితో తాళికట్టించుకునేందుకు పూనుకొని హతమార్చేందుకు ఒడిగట్టిన సంఘటన ఇది. అందుకు కూతురు ఒప్పుకోకపోవడంతో అల్లుడితో కలిసి రోకలిబండతో తలమట్టించే ప్రయత్నం చేసింది. మానవత్వాన్ని, బంధాల్ని మంటగలిపే ఈ జుగుప్సాకర ఘటన ఆదివారం తిరుపతి జిల్లా కేవీబీపురం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. శుక్రవారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి పోతే.. కేవీబీపురం మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలుడు (18), కేవీబీపురం మండల కేంద్రానికి చెందిన మైనర్ బాలిక (15) ఐదు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. భర్త చనిపోవడంతో బాలిక తల్లి (40) ఈ జంటతోనే కలిసి ఉంటోంది. ఈ క్రమంలో కొన్నాళ్లుగా ఆమెకు అల్లుడితో వివాహేతర బంధం ఏర్పడింది. ఈ క్రమంలో రాత్రి భార్య పక్కన ఉండగా వారిద్దరూ పెళ్లి చేసుకోబోయారు. ఈ సందర్భంలో తాళి మెడలో కడుతున్న భర్తను బాలిక అడ్డుకునేందుకు ప్రయత్నించింది. దీంతో ఆగ్రహంతో ఊగిపోయిన ఆమె తల్లి, భర్త బాధితురాలిపై దాడికి దిగారు. రోకలి బండతో తలపై మోదడంతో తీవ్రంగా గాయపడ్డ ఆమె కేకలు విని స్థానికులు వచ్చి రక్షించారు. అత్త, అల్లుడిపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ దేహశుద్ధి చేశారు. వారు అక్కడ నుంచి పరారయ్యేందుకు పారిపోవడంతో కేవీబీపురం పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కామాంధుల చేతుల్లో తీవ్రంగా గాయపడ్డ వివాహితను శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ఘనంగా సింగిల్ విండో చైర్మన్ ప్రమాణ స్వీకారం



ప్రజాశక్తి - వరదయ్యపాలెం : మండల సింగల్ విండో చైర్మన్‌గా ఆణిముత్యం నందకిషోర్ రెడ్డి ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ప్రమాణ స్వీకార మహోత్సవంలో నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. చెంగాలమ్మ ఆలయం నుండి ఆర్‌ఆర్ కళ్యాణమండపం వరకు ర్యాలీగా వెళ్లి నాయకులు కార్యకర్తలు సమక్షంలో నందకిషోర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శంకర్ రెడ్డి సంక్షేమ పథకాలతో పేదలను ఆదుకుంటూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. సింగిల్ విండో చైర్మన్ నందకిషోర్ రెడ్డి మాట్లాడుతూ ఈ అవకాశం ఇచ్చిన కూటమి ప్రభుత్వ పెద్దలకు, స్థానిక ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు అభినందనీయం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ కొనియాడారు. గత నాలుగు సంవత్సరాలుగా నెలకోసారి ప్రత్యేక ప్రతిభావంతులు, మానసిక వికలాంగులకు నిత్యావసర సరుకులు, వస్తువులు క్రమం తప్పకుండా పంపిణీ చేయడం ఆ సంస్థ నిబద్ధతకు నిదర్శనమని మెచ్చుకున్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలతో ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ సిఫారసుతో మంజూరయిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆదివారం ఎమ్మెల్యే చేతుల మీదుగా లబ్దిదారులకు పంపిణీ చేశారు.160 మంది లబ్ధిదారులకు రూ.1,32, 34,595 చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, రాష్ట్ర బీసీ సెల్ కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముగం రెడ్డి, నగిరి టిడిపి నాయకులు బాలాజీ, పుత్తూరు మండల తడుకు సర్పంచ్ బొబ్బిలి వెంకటేష్ యాదవ్,వడమల పేట నింద్ర విజయపురం నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



ప్రజాశక్తి -ఏర్పేడు: మండల కేంద్రం, ఏర్పేడు గ్రామపంచాయతీ, గాండ్ల వీధిలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం సమీపంలో నూతన బోరు వేశారు. ఏర్పేడు చెరువు వరవ కాలువ పనులలో భాగంగా గాండ్ల వీధికి వెళ్ళు పైపులైను దెబ్బతినింది. ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సూచనతో నియోజక వర్గ మహిళ టిడిపి నాయకులు గాలి కృష్ణవేణి, మండల టిడిపి నాయకులు పేరం నాగరాజు నాయుడుల నేతృత్వంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు నల్ల పాలెం శివయ్య అధ్యక్షతన బోరు వేశారు.

శ్రీనివాస్ చౌదరికి డాక్టరేట్



ప్రజాశక్తి - బాలాయపల్లి: మండలంలోని వెంగమాంబపురం గ్రామానికి చెందిన సాదనాల శ్రీనివాస్ చౌదరి వెంకటగిరి పట్టణంలోని ఈఎస్ఎస్ కళాశాలలో కామర్స్ అధ్యాపకులుగా పనిచేస్తూన్నారు. శ్రీ క్రిష్ణదేవరాయ యూనివర్శిటీ మేనేజ్మెంట్ విభాగంలో పనిచేసిన ప్రొఫెసర్ సిఎన్ కృష్ణ నాయక్ (రిటైర్డ్) మార్గదర్శకత్వంలో డిజిటల్ బ్యాంకింగ్లో యూపిఐల పాత్ర అనే అంశంపై శ్రీనివాస్ చౌదరి పరిశోధన చేశారు. ఈ పరిశోదన యూపిఐల ప్రవేశంతో ఆంధ్రప్రదేశ్‌లో డిజిటల్ బ్యాంకింక్ ఎలా విస్తరించింది. నగదు లావాదేవీలు తగ్గి ప్రజల్లో డిజిటల్ చెల్లింపులపై ఎంతలా నమ్మకం పెరిగింది. డిజిటల్ బ్యాంకింగ్‌కి ఎలా మైలు రాయిగా నిలిచిందని లోతుగా విశ్లేచించింది. శ్రీనివాస్ చౌదరి గతంలో అనేక మోనేజ్మెంట్ కళాశాలల్లో పనిచేశారు. శ్రీనివాస్ చౌదరికి శ్రీక్రిష్ణ దేవరాయ యూనివర్శిటీ డాక్టరేట్ ప్రకటించడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన ఆనందాన్ని వ్యక్తం చేయగా పలువురు ఆయనను అభినందించారు.

ముక్కంటి ఆలయానికి విరాళం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయానికి నరసన్నపేటకు చెందిన సురేష్ కుమార్, దేవి దంపతులు ఆదివారం రూ. 50 వేలు విరాళంగా అందజేశారు. ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో ఏఈఓ మోహన్‌కు అందజేసి నిత్యాన్నదాన పథకానికి ఖర్చు చేయాలని కోరారు. దాత కుటుంబానికి ఆలయ మర్యాదలతో స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం కల్పించారు.

ఘనంగా గురుదాస్ కామత్ జయంతి



ప్రజాశక్తి - శ్రీకాళహస్తి :శ్రీకాళహస్తి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం స్వర్గీయ మాజీ కేంద్రమంత్రి గురుదాస్ కామత్ జి జయంతి వేడుకలను తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జనరల్ సెక్రటరీ షేక్ కరీముల్లా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుఃగా, ఆల్ ఇండియా సోనియా గాంధీ విచార్ మంచ్ ఆంధ్ర ప్రదేశ్ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ అర్జున గురుమూర్తి, కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ ఓబీసీ సెక్రటరీ భాస్కరరావు యాదవ్, తిరుపతి జిల్లా మాజీ జనరల్ సెక్రటరీ నిత్యానందం, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉమాశంకర్‌లు పాల్గొన్నారు. గురుదాస్ కామత్ జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, శ్రీకాళహస్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ జనరల్ సెక్రటరీ పఠాన్ అల్తాఫ్, ఫ్రూట్స్ మర్చంట్, మక్ ధూమ్, నదీమ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం



ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు): జనసేన పర్యటనలో భాగంగా గంధం శ్రీనివాసులు ఆధ్వర్యంలో గత వారంలో తొట్టంబేడు మండలం, పొయ్య పంచాయతీ, ఎస్టీ కాలనీలో జనసేన పార్టీ యువ నాయకులు పర్యటించారు. అక్కడి గిరిజనులు ఆధార్ కార్డులు లేకపోవడం వలన, రేషన్ కార్డు తీసుకోలేకపోయామని, దానివలన రేషన్ బియ్యం తీసుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. జనసేన నాయకులు వారిని సచివాలయానికి తీసుకొని వెళ్లి అక్కడ అధికారులతో మాట్లాడారు. రేషన్ కార్డులు వారికి వచ్చేలోగా ప్రత్యామ్నాయంగా కొతం రేషన్ 400 కెజీల బియ్యాన్ని వారికి జనసేన నాయకులు అందించారు. మహిళలకు బట్టలు, పిల్లలకు బిస్కెట్లు ఆదివారం పంచారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి, మనీ, దినేష్, ప్రదీప్ కుమార్, పసల సురేష్, లక్ష్మణ్, మహేష్, కల్లిపూడి వెంకటేష్, మునిచంద్ర, గోపి, ముని కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో చేరికలు



ప్రజాశక్తి - శ్రీకాళహస్తి : జనసేన పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై, ఆదివారం శ్రీకాళహస్తిలో సుమారు 100 మంది యువకులు జనసేన పార్టీలోకి చేరారు. వీరు జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి కొట్టేసాయి ఆధ్వర్యంలో జనసేన తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కొణతనేరి గ్రామం నుండి జనసేన నాయకులు బాలాజీ నేతృత్వంలో 60 మంది, తొట్టంబేడు నుండి బాబు నేతృత్వంలో 50 మంది యువకులు జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి కొట్టేసాయి మాట్లాడుతూ ఈ యువత చేరికలు శ్రీకాళహస్తిలో జనసేన పార్టీ బలాన్ని మరింత పెంచుతాయన్నారు. పవన్ కళ్యాణ్ నాయకత్వంలో జనసేన పార్టీ యువత ఆకర్షణకు కొత్త ఉత్సాహాన్ని చేర్చుకుంది. జనసేన పార్టీ ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం పోరాడుతుందని తెలిపారు. యువకుల చేరికతో మా పోరాటానికి కొత్త ఊపిరి లభించిందన్నారు పవన్ కళ్యాణ్ గారి దృష్టి యువతపై ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జంగమయ్య సేవలో కర్ణాటక హైకోర్టు జడ్జి



ప్రజాశక్తి - శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దర్శనార్థం ఆదివారం కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ గీతా కదాబ భారత రాజా సెట్టర్ కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తి ఆలయానికి విచ్చేశారు. ఆలయ అధికారులు వారిని సాదరంగా ఆహ్వానించి అంతరాలయ దర్శనం, వేద ఆశీర్వచనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రోటోకాల్ ఏఈఓ మోహన్, ఆలయ ఇన్స్పెక్టర్ సుదర్శన్, ఏపిఆర్వో శ్రీనివాసులు, స్థానిక కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

భక్తుల నడకదారిలో కార్లు



ప్రజాశక్తి - శ్రీకాళహస్తి :శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో రెండో గేటు నుంచి మూడో గేటు వరకు భక్తుల కోసం ఏర్పాటు చేసిన రేకుల షెడ్డు ఇప్పుడు కార్ల పార్కింగ్ స్థలంగా మారిపోయింది. ఆదివారం భారీ రద్దీ సమయంలో దర్శనం కోసం వచ్చిన వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలు నడవడానికి కూడా చోటు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భక్తుల కోసం ఏర్పాటు చేసిన నడకదారిని కార్లు ఆక్రమించుకోవడంతో పరిస్థితి అదుపు తప్పింది. దేవాలయానికి దర్శనం కోసం వస్తాం... కానీ నడవడానికి దారి లేక కార్ల మధ్యలో తంటాలు పడుతున్నామని భక్తుల ఆరోపిస్తున్నారు. రేకుల షెడ్డు కింద కార్లు నిలిపివేయడంతో భక్తులు ఇప్పుడు పక్కనే ఉన్న నడిరోడ్డులో నడవాల్సిన దుస్థితి నెలకొంది. అధికారుల దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని భక్తులు కోరుతున్నారు.

క్రైం న్యూస్

టపాకాయలు సీజ్



ప్రజాశక్తి - నాగలాపురం: దీపావళి పండుగను పురస్కరించుకుని అనుమతులు లేకుండా ఇంటి వద్ద టపాకాయాలు విక్రయిస్తున్న ఇక్బాల్(65) పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు పట్టణంలోని స్థానిక బ్రాహ్మణ వీధిలో అనుమతి లేకుండా ఇంటిలో టపాకాయలు విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్ఐ సునీల్ తన సిబ్బందితో కలిసి ఇంటి పై దాడి చేసి ఇంట్లో నిల్వ ఉన్న టపాకాయలను స్వాదీనం చేసుకున్నారు. టపాకాయలు విలువ రూ. 1,05,100 లని ఎస్ఐ సునీల్ తెలిపారు. ఇక్బాల్ (65) పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అనుమతులు లేకుండా టపాకాయలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఎస్ఐతో పాటు కానిస్టేబల్ సాయికిరణ్, భూపతి, కృష్ణ, దివాకర్‌లు ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : దుస్తులు ఆరేస్తుండగా విద్యుత్ షాక్ గురై మహిళ మృతి చెందిన సంఘటన ఆదివారం కొత్త పేటలో ఆలస్యంగా వెలుగు చూసింది. టూ టౌన్ పోలీసుల కథనం మేరకు శ్రీకాళహస్తి పట్టణంలోని సీతాలాంబ ఆలయం సమీపంలో నివాసముంటున్న రేష్మ (47) గత నెల 22 తేదీన ఉతికిన దుస్తులు ఇంటి మెడపైన ఆరేసేందుకు వెళ్లింది. ఈ క్రమంలో విద్యుత్తు తీగలు దుస్తులకు తాకడంతో విద్యుత్ షాక్ గురై కింద పడిపోయింది. కాసేపటికి గుర్తించిన ఆమె భర్త హుటాహుటిన రేణిగుంటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



ప్రజాశక్తి - చంద్రగిరి : తిరుపతి-చంద్రగిరి రైల్వేస్టేషన్ల మధ్య రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్టేషన్ సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించ లేదని వారు తెలిపారు. మృతుని సమాచారం తెలిసిన వారు తమకు సమాచారమివ్వాలని రైల్వే పోలీసులు కోరారు.

ఘనంగా మాతమ్మ కొలుపు



ప్రజాశక్తి - శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి మండలం, గుణంజపల్లి హరిజనవాడలో మాతమ్మ కొలువును మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వయ్యాల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. మాతమ్మ ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మాతమ్మ అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. గ్రామస్తులు మాతమ్మకి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి మొక్కలు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి శ్రీ కాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జ్ఞానంబవారి మధు రెడ్డి, శ్రీకాళహస్తి పట్టణం యువజన విభాగ అధ్యక్షులు మల్లెంబాకం మునికృష్ణారెడ్డి, ప్రముఖ న్యాయవాది సున్నపు లక్ష్మీపతి రెడ్డి, పుదురు సురేష్ రెడ్డి పాల్గొని మాతమ్మ అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం వీరికి వయ్యాల కృష్ణారెడ్డి దుశ్శాలువాతో సత్కరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పసల కృష్ణయ్య గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కోదండరామాలయంలో విశేష ఉత్సవాలు



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: అక్టోబర్ నెలలో శ్రీ కోదండరామ స్వామి వారి ఆలయంలో జరగనున్న విశేష ఉత్సవాల వివరాలు ఇలా ఉన్నాయి. 11, 18, 25వ తేదీల్లో శనివారం సందర్భంగా ఉదయం 6 గంటలకు శ్రీ సీతారామ లక్ష్మణుల మూలవర్లకు అభిషేకం నిర్వహిస్తారు. 7న ఉదయం 9.30 గంటలకు అష్టోత్తర శతకలశాభిషేకం నిర్వహిస్తారు. 14న పునర్వసు నక్షత్రం సందర్భంగా ఉదయం 11 గంటలకు శ్రీ సీతారాముల కల్యాణం జరుగనుంది. సాయంత్రం 5.30 గంటలకు స్వామి, అమ్మవారిని తిరుచ్చిపై ఊరేగింపుగా తీసుకెళతారు. తదుపరి ఊంజల్‌సేవ నిర్వహిస్తారు. 20న దీపావళి ఆస్థానం నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.